క్లుప్తంగా

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీ చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

పుత్తూరు: భావితరాల కోసం ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేయాలని ఏపీ ట్రాన్స్‌కో డీఈ దేవాశీర్వాదం కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం పుత్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడడం ద్వారా బిల్లులు తగ్గుతాయని తెలిపారు. భావితరాలకు భరోసా కల్పించవచ్చన్నారు. 3 లేదా అంతకంటే ఎక్కువ స్టార్లు కలిగిన గృహోపకరణాలను వినియోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చునన్నారు. అలాగే ఎల్‌ఈడీ బల్బ్‌లను వినియోగించాలని, అనవసరంగా విద్యుత్‌ను వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ శంకరయ్య, ఏఈలు జైసాయి, రవికుమార్, ప్రకాష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



నగరి : స్థానిక ఓంశక్తి ఆలయంలో ఇరుముడి ఉత్సవాలను పురస్కరించుకుని 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాలెండర్లను ఆవిష్కరించి అందరికీ అందజేశారు. ఆలయ నిర్వాహకులు కమిషనర్ పేరిట అర్చనలు చేసి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ వెంకట్రామయ్య, శానిటరీ అధికారి పురుషోత్తం, ఉభయదారులు రామకృష్ణ, గుణశేఖర్, రాజా, వినోద్, మోహన్ కుమార్, పోపట్ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, చెక్‌డ్యామ్ పరిశీలన

గంగాధరనెల్లూరు: మండలంలో బంగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని శెట్టిపారం నుంచి మిట్టపల్లెకు ఉన్న రోడ్డును, చెక్ డ్యామ్‌ను గురువారం ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పరిశీలించారు. రోడ్డు గుంతలమయమై బురదతో కూడా అధ్వానంగా ఉందని, అలాగే చెక్‌డ్యామ్ కూడా దెబ్బతిన్నట్టు గుర్తించారు. రోడ్డు, చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బంగారెడ్డిపల్లె పంచాయతీ సెక్రటరీ సింధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

పాలసముద్రం : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇన్‌లైన్ క్లోరినేషన్ వాటర్‌లైన్ చేస్తున్నామని సర్పంచ్ అమరావతి, మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. గురువారం ప్రభుత్వం టీవీఎన్‌ఆర్ పురం ఆది ఆంధ్రవాడకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరుమోటారు పైప్‌లైన్‌కి క్లోరినేటెడ్ నీటి సరఫరా నిమిత్తం పరికరాలను అమర్చారు. రమేష్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామానికి బోరు మోటారు నుంచి పోతున్న పైప్‌లైన్‌కు క్లోరినేటెడ్ వాటర్ సప్లై పరికరాలు అమర్చుతామన్నారు. ఇలా అమర్చడం వల్ల బోరు మోటారు నుంచి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ



గోవింద నామస్మరణ చేస్తున్న భజన బృందం

గంగాధరనెల్లూరు: మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని దిగపూరులో భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ, భజనలు చేశారు. గ్రామస్తులు శ్రీరామ, గోవింద నామస్మరణతో సంకీర్తనలు పాడుతూ, గరుడ స్తంభం వెలిగించి పూజలు చేశారు. విశ్రాంత వీఆర్‌ఓ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, హిందూ ధర్మ ప్రచారానికి పూర్వం కాలంలో మార్గశిర మాసంలో విష్ణు నామాలు జపిస్తూ పెద్దలు భజనలు చేసేవారని, అదే ఒరవడి తాము కొనసాగిస్తున్నామన్నారు. సంక్రాంతి పర్వదినం వరకు రోజు ఉదయం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని భజన బృందం తెలిపింది.

శ్రీకాళహస్తి ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో 22 మంది ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేశారు. ఈఓలు మారిన ప్రతిసారి అంతర్గత బదిలీలు చేయడం ఆనవాయితీగా వస్తోందని అందులో భాగంగా బదిలీలు చేసినట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. గతంలో హరితాభివృద్ధిలో పని చేసిన వారందరికీ ఆలయంలో అవకాశం కల్పించారు. గత ప్రభుత్వంలో విమర్శలు చేసిన నాయకులు.. అధికారంలోకి వచ్చిన తరువాత అదే పంథాను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అడుగుకో గుంత..

తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీనికితోడు అధిక లోడుతో లారీలు వెళుతున్నాయి. దీంతో రోడ్లు దెబ్బతిన్నాయి. అడుగుకో గుంత పడడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. గుంతల రోడ్డులో ఎలా ప్రయాణించాలి అంటూ యువకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు గురువారం జీడీ నెల్లూరులో నిరసన తెలిపారు.

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- పట్టించుకోని అధికారులు



గుంతల రోడ్డులో స్తంభించిన వాహనాలు



గుంతలు పడిన తూగుండ్రం రోడ్డు

గంగాధర నెల్లూరు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గంగాధర్ నెల్లూరులోని తూగుండ్రం– బలిజకండ్రిగ రోడ్డు అధ్వానంగా మారింది. దీనికి తోడు తర్చూరు రోడ్డు పనులు చేస్తుండడంతో వాహనాలు అధిక లోడుతో వెళుతుండడంతో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. గంగాధర్ నెల్లూరు గ్రామం నుంచి వేపంజేరికి నాలుగు కిలోమీటర్ల ప్రయాణం గంటకు పైగా పడుతోందని స్థానికులు వాపోతున్నారు. నిత్యమూ రోడ్డుప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో చలనం లేదు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. తర్చూరు రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న భారీ వాహనాలల్లో అధిక టన్నేజీతో నిర్మాణ సామగ్రిని తరలిస్తుండడంతో రోడ్లు గుంతలమయమయ్యాయి. రోడ్డును బాగు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులు, రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధులను కోరినా పట్టించుకోలేదు.

ఈ క్రమంలో పలువురు యువకులు గురువారం నిరసన తెలిపారు. ఈ రోడ్డులో వారం రోజుల్లో పదిమందికి పైగా ద్విచక్ర వాహనాల్లో వెళుతూ కింద పడి గాయపడ్డారని, ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు.



గుంతల రోడ్డులో ప్రయాణించలేమంటూ నిరసన తెలియజేస్తున్న గ్రామ ప్రజలు, యువకులు

దివ్యాంగులకు సహాయ జీవన పరికరాలు

– నేడు గుర్తింపు శిబిరం
– మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి : దివ్యాంగులు, వృద్ధులకు సహాయ జీవన పరికరాల పంపిణీ కోసం జిల్లా అధికారుల సహకారంతో భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ప్రత్యేక గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. అర్హత, ఆవశ్యకతను గుర్తించేందుకు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు నగరిలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ గుర్తించిన వారికి చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ల చేతి కర్రలు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, వాకర్స్, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్లు, రోలోటేర్స్, ఎంఎస్ కిట్స్, అంధులకు చేతి వాచ్, చేతి కర్రలు, టచ్ ఫోన్, వాయిస్ ఫోన్, ఎల్‌బో క్రచస్, నయమైన కుష్ఠు వ్యాధిగ్రస్తులకు లెప్రసీ కిట్లు, డైసీ ప్లేయర్, ఎంఎస్‌ఐడీ కిట్స్ అందజేస్తామని పేర్కొన్నారు. దారిద్య్ర రేఖకు దిగువనున్న వారు అర్హులని తెలిపారు. ఆవశ్యకతను బట్టి ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ పరికరాలు అందజేస్తామని వెల్లడించారు. శిబిరానికి వచ్చే వారు యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రము రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. నాలుగు ఫొటోలు ఉండాలని తెలిపారు. వయోవృద్ధులకు యూడీఐడీ కార్డు అవసరం లేదని పేర్కొన్నారు.

మినీ గోకులం షెడ్ల పనుల పరిశీలన



గోకులం షెడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని చవనపల్లెలో రైతులు నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్ల పనులను ఏపీడీ సునీల్ గురువారం పరిశీలించారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో చేస్తున్నారా, లేదా? అని ఆరా తీశారు. రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి రవికుమార్, ఏపీఓ ఇందు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

ఘనంగా అగత్తియర్ జయంతి వేడుకలు

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో గురువారం అగత్తియర్ ముని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మనక్షత్రమైన మార్గశి నెల ఆయిల్య నక్షత్ర దినం సందర్భంగా విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. దీపాలు వెలిగించారు. పలువురికి అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజలు చేస్తున్న భక్తులు

పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు

పుత్తూరు: గ్రామాల్లో చేట్టిన సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఉపాధి హామీ పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ హెచ్చరించారు. ఆయన గురువారం తడుకు పంచాయతీ పరిధిలోని ఎగువ గూళూరులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీవో రమేష్‌బాబును ఆదేశించారు. ఆయన వెంట ఏపీడీ సరిత ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస్‌ప్రసాద్

టిప్పర్లు అధిక లోడ్ రవాణా చేస్తే చర్యలు

సత్యవేడు : క్వారీల నుంచి కంకరు, డస్టు తరలిస్తున్న టిప్పర్లు అధిక లోడ్‌తో తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ మురళి హెచ్చరించారు. గురువారం సత్యవేడు వరదయ్యపాళెం టిప్పర్ల యజమానులతో సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఓవర్ టన్నేజ్ టిప్పర్లను అనుమతించేది లేదన్నారు. సత్యవేడు, ఇతర గ్రామాల్లో జన సంచారం ఉన్న ప్రాంతాల్లో వెళుతున్న టిప్పర్లు మితిమీరిన వేగంతో వెళ్లకూడదని తెలిపారు. రోడ్ల సమీపంలోని పాఠశాలల ప్రాంతాల్లో నెమ్మదిగా వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామస్వామి, మల్లికార్జున్, టిప్పర్ల యజమానులు పీజీఎం మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రయాణం



ప్రమాదమని తెలిసినా విద్యార్థులు, పెద్దలు పుట్‌పాత్‌లపై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. పుత్తూరు–సత్యవేడు మార్గంలో బస్సుల సంఖ్య చాలా తక్కువ. ఈ మార్గంలోని కైలాసకోన, తుంబూరు, పాలమంగళం, కొప్పేడు, పిచ్చాటూరు, నాగలాపురం వెళ్లేవారు బస్సుల కోసం ఫీట్లు చేయాల్సి వస్తోంది. ఒకేసారి ఎక్కువ మంది ఎక్కడంతో బస్సు నిండిపోయి పుట్‌పాత్ మీద నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. సత్యవేడు మార్గంలో బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను పలుమార్లు కోరినా ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

– పుత్తూరు

జాతరలో పోలీసుల సేవలు అభినందనీయం

కార్వేటినగరం: గ్రామ దేవత శ్రీబంగారమ్మ జాతర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులకు ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. గురువారం జాతర వేడుకల్లో విధులు నిర్వర్తించిన సీఐలు, ఎస్ఐలు, 100 మంది సిబ్బందిని ఆలయం తరపున సన్మానించి ఆలయ అధ్యక్షుడు మాట్లాడారు. కార్వేటినగరం ప్రజలు కొంగుబంగారంగా కొలిచే శ్రీబంగారమ్మ జాతరను సంస్థానాధీశుల కాలం నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏడాది గ్రామ యువత కూడా జాతర నిర్వహణలో తమ వంతు ఆర్థికసాయం అందించడమే కాకుండా పోలీస్ అధికారులతో కలసి ప్రశాంతమైన వాతావరణంలో జాతర వేడుకలకు నిర్వహించారన్నారు. ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, యువత పాల్గొన్నారు.



జాతర వేడుకలకు సేవలు అందించిన పోలీసు అధికారులు

అనాలోచిత నిర్ణయాలను సమీక్షించాలి

నగరి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలను పునఃసమీక్షించాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మణిగండన్, అసోసియేట్ అధ్యక్షుడు మునిరత్నం డిమాండ్ చేశారు. వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నపత్రాలు తీసుకెళుతూ తలపుల పల్లి ఉపాధ్యాయుడు సిద్దయ్యశెట్టి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం మానుకోవాలని కోరారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్

గంగాధరనెల్లూరు : షెడ్యూల్ కులాలల్లోని ఉప వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ నియమించిందని ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఈ కమిటీ వర్గీకరణ అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తుందన్నారు. ఏకసభ్య కమిషన్ కార్యాలయం ఎన్టీఆర్ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారని, సంఘాలు, వ్యక్తులు ఏకసభ్య కమిషన్‌కు వినతి పత్రాలు ఇవ్వొచ్చన్నారు. 2025 జనవరి 9వ తేదీ వరకు ఫిర్యాదులు, సలహాలు పంపేందుకు అవకాశం ఉందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలలో ఎస్సీల ఉప వర్గాలపై ప్రాతినిధ్యం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా ఉన్న లోటుపాట్లను పరిశీలించి కమిషన్ నివేదిక పంపుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని షెడ్యూల్ కులాల సంఘాలు, సభ్యులు ఈ అంశాలపై ఏకసభ్య కమిషన్ కు విన్నవించుకోవచ్చునని తెలియజేశారు.

సోలార్‌తో విద్యుత్ భారానికి చెక్



ర్యాలీ చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది

నగరి : సోలార్ వాడకంతో విద్యుత్ భారం తగ్గుతుందని ట్రాన్స్‌కో డీఈ సురేష్ కుమార్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం నగరి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏజేఎస్ కల్యాణ మండపంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ బిజిలీ ముఫ్తీ యోజన పథకంపై సదస్సు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ముఖ్య ఉద్దేశం విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సోలార్ వైపు అడుగులు వేయడమేనన్నారు. ప్రతి గృహానికి సోలార్ అమర్చుకోవాలని, దానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీఈలు వెంకటముని, లోకనాథరావు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పుట్టినరోజును పండగలా చేసుకుందాం



సమావేశంలో మున్సిపల్, మండల నాయకులు

నగరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పండగలా చేసుకుందామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వారు గురువారం మాజీ మంత్రి ఆర్కేరోజా కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. మహానేత వైఎస్సార్ విగ్రహాల వద్ద కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకోవడంతో పాటు, పేదలకు అన్నదానం, రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పార్టీ మున్సిపల్, మండల అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తిరుమలరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పుష్ప కుటుంబ సభ్యులు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ మిట్టూరులోని సీఎస్ఐ చర్చిలో గురువారం స్థానిక సర్పంచ్ పుష్ప, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివాజీ ఆధ్వర్యంలో సపోజ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి పాస్టర్లు ప్రత్యేక ఆరాధన కార్యక్రమం, వాక్య సందేశమిచ్చారు. ప్రపంచంలో శాంతి నెలకొల్పాలంటే యేసుక్రీస్తు ప్రబోధించిన మార్గంలో అందరూ సాగాలన్నారు. క్రైస్తవులు అనుదిన ప్రార్థనను విస్మరించరాదన్నారు. ప్రార్థనతోనే బలం, జీవమన్నారు. అనంతరం 150 మంది వృద్ధులకు చీరలు, పంచెలు, దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన పాస్టర్లు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ అధికారి దయాకర్, అపర్ణ, బాలయ్య, రజిని, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుస్థిర అభివృద్ధిపై శిక్షణా తరగతులు

విజయపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండురోజుల నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఇస్తున్న శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఎంపీడీవో రమణప్రసాద్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. పంచాయతీలో విధులు నిధుల వినియోగంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలు, పరిశీలనా విధానం, వీధి లైటింగ్, ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర అంశాలను వివరించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రమణ ప్రసాద్

పరీక్షల విధానంలో అసంబద్ధ విధానాలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం పరీక్షల విధానంలో అమలు చేస్తున్న అసంబద్ధ విధానాలను రద్దు చేయాలని ఫ్యాప్టో సంఘ నాయకులు గంటామోహన్, చెంగల్‌రాయ మందడి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు పూతలపట్టులో రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటనపై గురువారం డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గురువారం నిర్వహించాల్సిన సమ్మేటివ్ –1 ప్రశ్నపత్రాలను తీసుకెళుతూ ప్రమాదంలో మృతి చెందిన సిద్దశెట్టికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. సమ్మేటివ్ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచడం, రోజు రెండు సార్లు దూరప్రాంతాలకు తీసుకెళ్లడం చాలా కష్టతరమన్నారు. ముఖ్యంగా మహిళా టీచర్ల పరిస్థితి మరింత దారుణమని చెప్పారు. ఇలాంటి అసంబద్ధ విధానాల వల్లనే సిద్దయ్య శెట్టి మృతి చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు, ఇబ్బందులు పరిగణనలోకి తీసుకోకుండా నూతన విధానాలు అమలు చేయడం దారుణమన్నారు. వెంటనే సిద్దయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రోషయా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, భాస్కరరావు, ముక్తార్ అహ్మద్, తులసిబాబు, సారథి, రాజేంద్రన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

నగరి : పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భారత రాజ్యాంగం మీద జరిగిన చర్చలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఖండించింది. ఆ సంఘం నాయకులు గురువారం నగరి బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని నినాదాలతో హోరెత్తించారు. సంఘం జాతీయ కార్యదర్శి ఎంకే. ప్రకాష్, సంఘం జాతీయ అధ్యక్షుడు డి.గోవిందస్వామి మాట్లాడుతూ అంబేద్కర్ .... అంబేద్కర్ అంటూ నినాదాలు చేయడం కన్నా భగవంతుడి పేరును స్మరిస్తే ఏడు జన్మలకు స్వర్గ ప్రాప్తి కలుగుతుందని అమిత్‌షా చెప్పడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మనుధర్మ భావజాలాన్ని పార్లమెంట్‌లో మాట్లాడడం సబబు కాదన్నారు. ఆయన ఉద్దేశపూర్వకంగానే అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడారని తెలిపారు. ఆయనను వెంటనే అరెస్టు చేయాలని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నగరి మండల గౌరవ అధ్యక్షుడు బాలవర్ధన్ రాజు, అధ్యక్షుడు విజయ్ చందర్, ఉపాధ్యక్షులు మైల్ స్వామి, బాబు, ప్రధాన కార్యదర్శి తంగరాజు, కార్యదర్శి యోవాన్, కోశాధికారులు రజని, కొల్లాపూరి, అలెక్స్, సభ్యులు సందీప్, సేటు, శివ, హరి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నేతలు